క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దవటం: గ్రామ వలంటీర్ల నియామకం కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఫణి రాజకుమారి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆమె మాట్లాడుతూ సిద్దవటంలో- 1, (ఓసీ- జనరల్), పొన్నవోలు- 1, (ఎస్సీ- పురుషులు), మాధవరం- 1లో - 1(బి.సి- బి జనరల్)గా కేటాయించామన్నారు. ఈనెల 5వ తేదీ నుంచి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తుతోపాటు విద్యా అర్హత సర్టిఫికెట్లను జతపరచాలన్నారు. 8,9 వ తేదీలలో ఇంటర్వ్యూ ఉంటాయన్నారు.

సిద్దవటం ఆసుపత్రిలో గైనకాలజిస్టు నియామకం

సిద్దవటం : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి గైనకాలజిస్టు నియమితులైనట్లు ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ మధుశేఖర్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ గైనకాలజిస్టు సెలవులో వెళ్లడంతో గర్భిణులు, బాలింతలు వైద్య పరీక్షలకు చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. గైనకాలజిస్టు నియామకాన్ని రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి డీసీహెచ్‌ఎస్ దృష్టికి తీసుకెళ్లి సిద్దవటం ఆసుపత్రికి గైనకాలజిస్టును నియమించాల్సిందిగా కోరారన్నారు. ఈ మేరకు గైనకాలజిస్టుగా జ్యోత్స్నను నియమించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఆమె బాధ్యతలు చేపట్టారన్నారు. గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ఆయన తెలిపారు.

గంగమ్మ జాతర


గంగమ్మను గుడికి తీసుకువస్తున్న యువకులు

చిట్వేలి : మండల కేంద్రంలో గురువారం గంగమ్మ జాతరను ఘనంగా నిర్వహించారు. బుధవారం రాత్రి జాతర ప్రారంభమై గురువారం సాయంత్రానికి ప్రశాంతంగా ముగిసింది. జాతరలో వేలాది మంది భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకొని, మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పందేరపుబండ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో మండల కన్వీనర్ చెవ్వు శ్రీనివాసులురెడ్డి, ఉపసర్పంచ్ ఉమామహేశ్వరరెడ్డి, మలిశెట్టి వెంకటరమణ, వెంకటరెడ్డి, సుబ్బరాయుడు, రమణయ్య, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎస్‌ఐ సుభాష్ చంద్రబోస్, సిబ్బంది పటిష్ట బందోబస్తు చేసి జాతరను ప్రశాంతంగా జరిగేలా పర్యవేక్షించారు.

రైతులకు వైఎస్సార్ జలకళ సామగ్రి పంపిణీ


జలకళ సామగ్రిని అందజేస్తున్న సర్పంచ్‌లు

సంబేపల్లె : మండలంలోని పలు గ్రామాలలో వైఎస్‌ఆర్ జలకళ ద్వార బోర్లు వేసిన రైతులకు గురువారం సామగ్రిని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అధికారులు, సిబ్బంది పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా మోటకట్ల, నాగిరెడ్డిగారిపల్లె, గుట్టపల్లె, గున్నికుంట్ల గ్రామాలలో 14 బోర్లకు జలకళ ద్వార బోరు వేసిన రైతుకు పైపు, మోటర్, స్టార్టర్‌తో పాటు సంబంధించిన పరికరాలను అందజేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డికి రైతులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వీరాంజనేయ స్వామి తిరునాల

సంబేపల్లె : మండలంలోని శెట్టిపల్లె పంచాయతీ పాలాలబండ సమీపంలో కొలువైన వీరాంజనేయస్వామి తిరునాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. వేదపండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు దాతల సహకారంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నాడు - నేడు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎంఈఓ

సిద్దవటం : మండలంలోని ప్రాథమిక పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలలో జరుగుతున్న ఫేజ్ - 2 నాడు - నేడు పనులను గురువారం పరిశీలించామని ఎంఈఓ శంకరయ్య తెలిపారు.

గుండెపోటుతో హెడ్ కానిస్టేబుల్ మృతి

నందలూరు(రాజంపేట) : నందలూరు పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రహీం(55) గురువారం రాత్రి గుండెపోటుతో స్వగృహంలో మృతిచెందాడు. రహీం మృతి పట్ల ఏఎస్‌ఐలు శంకర్‌నాయక్, సుబ్బరాయుడులతోపాటు నందలూరు పోలీసులు తమ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రహీం సామ్యుడిగా డిపార్టుమెంట్‌లో మంచి పేరు తెచ్చుకున్నారు.

వాగ్గేయకారుడి జయంత్యుత్సవాలకు సర్వం సిద్ధం

- 6 నుంచి అన్నమయ్య 615వ జయంత్యుత్సవాలు
- అటు తాళ్లపాక, ఇటు 108 అన్నమయ్య విగ్రహం వద్ద ఉత్సవాలకు ఏర్పాట్లు


తాళ్లపాకలో టీటీడీ నిర్మించిన అన్నమయ్య ధ్యానమందిరం


108 అడుగుల అన్నమయ్య విగ్రహం

అదివో అల్లదివో శ్రీవారి వాసము పదివేల శేషుల పడగలమయము... లాంటి కీర్తనలతో పదకవితాపితామహుడిగా తాళ్లపాక అన్నమాచార్యులు శ్రీవారి భక్తుల హృదయాల్లో చెరగని ముద్రవేసుకున్నాడు. అన్నమాచార్యుడు 615 జయంతి సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

రాజంపేట : భాగవతసేవ పరాయణులైన నారాయణసూరి, లక్కమాంబలకు సంతానం లేకపోవడంతో ఏడుకొండలస్వామిని మొక్కుకున్నారు. తిరుమలకు చేరుకున్న ఈ దంపతులు స్వామి మందిరం ప్రవేశించారు. గురుడ స్తంభం వద్ద సాగిలపడ్డారు. వెంకటేశ్వరస్వామి తన నిజ ఖడ్గమైన నందకాన్ని ఆ పుణ్యదంపతులకు ప్రసాదించాడు. వాళ్లు పరమానంద భరితులయ్యారు. వేంకటపతిని దర్శించి స్తుతించారు. సంతోషంతో తాళ్లపాకకు తిరిగివచ్చారు. మే 9, 1408న రాజంపేట మండలం తాళ్లపాకలో జన్మించాడు. తన ఎనిమిదవ యేట అన్నమయ్యకు ఆయన గురువు ఘన విష్ణుదీక్ష నొసిగినప్పుడు అన్నమాచార్య నామం స్థిరపడింది.

అన్నమయ్య తిరుమల పయనం..

అన్నమయ్య ఇంటిలో తల్లి సంగీతం, తండ్రి పాండిత్యం ఛాయలతో పెరిగాడు. ఉపవీత సంస్కారం పొందిన తర్వాత ఇంటి గురుకలంలో విద్యాభ్యాసం కొనసాగింది. ఏకసంతాగ్రాహి అయినందున అనతి కాలంలో ఉన్నత విద్యావంతుడయ్యాడు. తన పదహారవ యేట అన్నమయ్యకు శ్రీ వేంకటేశ్వర దర్శనానుభూతి కలిగింది. అప్పటి నుంచి అన్నమయ్య అద్భుతమైన కీర్తనలు రచింపసాగాడు. వేడుకుందామా వెంకటగిరి వేంకటేశ్వరుని..అంటూ భక్తబృందంతో కలిసి అన్నమయ్య తిరుమలకు పయనమయ్యారు. వేంకటేశ్వరుని కీర్తిస్తూ తిరుమలలోనే జీవితం గడిపాడు.

సంసారం.. సంకీర్తనం

తిరుమల నుంచి తాళ్లపాకకు చేరుకున్న అన్నమయ్యకు తిమ్మక్క, అక్కమ్మ అనే పడతులతో వివాహం జరిపించారు. వైవాహిక జీవితంలో పడిన అన్నమయ్య ఒకరోజు తన ఇద్దరు భార్యలతో తిరుమలకు చేరుకున్నారు. ఆ సమయంలోనే శ్రీ వేంకటపతిపై రోజుకొక సంకీర్తన వినిపించాలని సంకల్పించాడు. అప్పటి నుంచి అన్నమయ్య పుంఖానుపుంఖాలుగా కీర్తనలు చెప్పాడు. అతని శిష్యులు వాటిని గానం చేస్తూ తాళపత్రాలకు ఎక్కించారు. భార్యలతో కలిసి తీర్థయాత్రలకు బయలుదేరారు. ముందుగా తన స్వగ్రామంలోని చెన్నకేశవుని అర్చించారు. మార్గంలోని నందలూరు సౌమ్యనాథుడు, ఒంటమిట్ట రామయ్య, కడప వెంకటరమణుని, చాగలమర్రి చెన్నకేశవుని, అహోబిలం నృసింహస్వాములను దర్శించుకుని కీర్తనలు ఆలపించారు. వైష్ణవ క్షేత్రాలను దర్శించుకున్నారు. అన్నమాచార్యులు ఆలపించిన కీర్తనలు అంతటా ప్రసిద్ధి చెందాయి.

అన్నమయ్య కీర్తనలు..రచనలు

అన్నమయ్య సంకీర్తనా సేవ సంగీత, సాహిత్య, భక్తి పరిపుష్టం. తెలుగు వ్యవహారిక భాష, దేశి సంగీత విధానాలు రెండు అతని రచనలలో ఉన్నాయి. లభించిన వాటిలో తొలి సంకీర్తనలు కనుక అన్నమయ్య సంకీర్తనాచార్యుడు, పదకవితాపితామహుడు అయ్యాడు. 32వేల కీర్తనలు ఆలపించారు. అలుమేలు మంగ, శ్రీనివాసుల కీర్తనలకు తన జీవితాన్ని అంకితం చేసిన పరమభక్తుడు అన్నమయ్య. రచనలలో భక్తి, సంగీతం, సాహిత్యం, శృంగారం, వేదాంతము అత్యంత మనోహరంగా వినసొంపుగా చెప్పబడ్డాయి. సరళమైన మాటలలో అధ్యాత్మిక సత్యాలను, వెంకటపతి తత్వాన్ని, జీవాత్మ పరమాత్మల సారాంశాన్ని వినిపించాడు. లోకనీతిని, ధర్మాన్ని, విష్ణుతత్వాన్ని కీర్తించాడు. దక్షిణాపదంలో భజన సంప్రదాయానికి అన్నమయ్యే ఆద్యుడు.

జయంత్యుత్సవ వివరాలు..

ఈనెల 6 నుంచి 8వరకు అన్నమయ్య 615 జయంత్యుత్సవాలు నిర్వహించనున్నారు. తాళ్లపాక, అన్నమయ్య 108 విగ్రహం వద్ద సంగీత, నృత్య కార్యక్రమాలు జరుగనున్నాయి. 6న తాళ్లపాకలో అన్నమయ్య ధ్యాన మందిరం వద్ద ఉదయం 10గంటలకు శ్రీవారి కల్యాణం చేయనున్నారు. అదే రోజు సాయంత్రం అన్నమయ్య థీం పార్కులో ఊంజల్ సేవ జరుపనున్నారు.

అన్నమయ్య కీర్తనలు విశ్వవ్యాప్తం కావాలి



ఈనెల 6 నుంచి 12 వరకు అన్నమయ్య జయంతి ఉత్సవాలను తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహిస్తోంది. తాళ్లపాక, అన్నమయ్య థీం పార్కు, తిరుపతిలోని అన్నమయ్య కళామందిరంలో అన్నమయ్య జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నాం. తాళ్లపాకలో 6 నుంచి 8 వరకు ఉత్సవాలు జరుగుతాయి. 6న తాళ్లపాకలో శ్రీవారి కల్యాణం ఉంటుంది. అన్నమయ్య కీర్తనలు విశ్వవ్యాప్తం కావాలని అన్నమాచార్య ప్రాజెక్టు విస్తృతంగా కృషి చేస్తోంది.

– అక్కెళ్ల విభీషణ శర్మ, డైరెక్టర్, అన్నమాచార్య ప్రాజెక్టు, తిరుపతి

రోడ్డు పనులు ప్రారంభం


భూమిపూజ చేస్తున్న ఎంపీటీసీ చంద్రశేఖర్

నందలూరు(రాజంపేట) : రోడ్డు సరిగాలేక అవస్థలు పడుతున్న పొత్తపి గ్రామానికి పనులు ప్రారంభమయ్యాయి. రూ.50 లక్షలతో సీసీ రోడ్డు పనులకు గురువారం ఎంపీటీసీ మోదుగల చంద్రశేఖర్ ప్రారంభించారు. ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి కృషితో రోడ్డు మంజూరైందన్నారు. సీసీరోడ్డు నిర్మించడం పట్ల గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

అభినందన మాల


రూపానందరెడ్డి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైకాపా నాయకులు

ఓబులవారిపల్లె: వైఎస్సార్ సీపీ నాయకుడు ముక్కా రూపానందరెడ్డి జన్మదినం సందర్భంగా గురువారం ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. గుంతకల్ రైల్వేబోర్డు మెంబర్ తల్లెం భరత్ కుమార్ రెడ్డి గజమాలతో సత్కరించారు. ముక్కా సాయి వికాష్ రెడ్డి, పాముారి రామిరెడ్డి, బత్తిన వేణు గోపాల్ రెడ్డి, తల్లెం జగన్‌మోహన్ రెడ్డి, తల్లెం విష్ణువర్దన్ రెడ్డి, సర్పంచ్ శ్రీధర్ పాల్గొన్నారు.

పథకాల లబ్ధిలో మహిళలకే పెద్దపీట

- సమస్యలు వింటూ.. పరిష్కరిస్తూ సాగిన కార్యక్రమం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు


పథకాలను వివరిస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

ఓబులవారిపల్లె : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి ఇంటికి ఏదో ఒక విధంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని కటికంవారిపల్లె బలిజపల్లి, జె.వడ్డిపల్లె, ముదినేపల్లె, దళితవాడలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి, సర్పంచ్ ఎస్‌పీ జయపాల్ రెడ్డిలు నిర్వహించారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ద్వారా అందుతున్న సంక్షేమ పథకాల గురించి కొరముట్ల వివరించారు. ఆయన మాట్లాడుతూ మహిళలకు పెద్దపీట వేస్తూ పథకాలన్నీ మహిళలు పేరుపైనే అందిస్తున్నారన్నారు. అనంతరం కటికంవారిపల్లిలో విద్యుత్ సమస్యలు, రేషన్ కార్డుల సమస్యలు, పింఛన్ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన కొరముట్ల సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామంలోని శ్రీ కృష్ణ మందిరానికి రూ. 20 వేలు నగదును నిర్వాహకురాలు లీలావతమ్మకు అందించారు. గ్రామంలో శిథిలావస్థకు చేరుకున్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనాలను వారు పరిశీలించారు. దశాబ్దాలుగా భవనాలు దెబ్బతిని విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పక్కా భవనాల నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల నాగమ్మ, మాజీ సర్పంచ్ సుబ్రమణ్యం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు అరిగెల రమణ, ఓడీ అమరనాథరెడ్డి, టంగుటూరి శివారెడ్డి, టంగుటూరి సుధాకర్ రెడ్డి, ఓబిలి శ్రీనివాసులు రెడ్డి, టంగుటూరి రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ విజయారావు, ఏపీఎం ఆర్ముగం, డీటీ రామ్మోహన్, ఏఈ కిరణ్, వలంటీర్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంక్షేమమే మా జెండా.. ఏజెండా

- ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం
- ప్రజలు సంతోషంగా జీవించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి


మహిళలకు పథకాల లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : ప్రజలను సుఖ,సంతోషాలతో జీవించేలా చేయడమే ధ్యేయంగా సీఎం జగన్ రాష్ట్రంలో పరిపాలనను సాగిస్తున్నారని ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీలోని 32వవార్డు పాత రాయచోటిలో ఆయన గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటగా శివాలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే వార్డు పరిధిలోని జెండామాను వీధి, అయ్యప్ప స్వామి వీధి, ఫిల్టర్‌వీధి, శివాలయం వీధి, బోయవీధి, కోనేటి గడ్డవీధులలో ఆయన పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని ప్రశ్నిస్తూ అందరి వారికి వెంటనే పథకాలు అందేలా చూడాలంటూ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కరోనా కాలంలోనూ సంక్షేమం అందించామని గుర్తు చేశారు. సంక్షేమమే వైఎస్సార్‌సీపీ జెండా, ఏజెండా అని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకే గడప గడపకు వచ్చామన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో దేశంలో ఆదర్శ సీఎంగా జగన్ నిలుస్తున్నారంటూ తెలిపారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం

ఏటిగడ్డ ప్రాంతవాసులకు రహదారి సౌకర్యాన్ని కల్పిస్తామంటూ ఈ సందర్భంగా ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఆ ప్రాంతంలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలంటూ అధికారులను ఆదేశించారు. హరినాథ దేవాలయం వీధి నుంచి మాండవ్య నది మీదుగా తమవీధికి రహదారి సౌకర్యం కల్పించాలని కోనేటి గడ్డ వీధివాసుల విన్నపానికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. జెండా మానువీధిలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరిస్తామంటూ ఎమ్మెల్యే హామీనిచ్చారు. పూడిగుడిసెలో నివసిస్తున్న కందుకూరి ఈశ్వరమ్మకు వెంటనే పక్కా గృహం మంజూరు చేయాలంటూ ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్‌లు గువ్వల లక్ష్మిదేవి, మదనమోహన్‌రెడ్డి, గౌస్‌ఖాన్, ఆసిఫ్‌అలీఖాన్, అల్తాఫ్, ఈశ్వర్, వైఎస్‌ఆర్‌సీపీ నేతలు కొత్తిమీర ప్రసాద్, బేపారి మహమ్మద్‌ఖాన్, కొత్తిమీర ప్రసాద్, ఫయాజ్‌అహమ్మద్, షబ్బీర్, రియాజ్, జానం రవి, రియాజుర్ రహిమాన్, అన్నా సలీం, ఆనందరెడ్డి, ఖాదర్‌వలీ, కో - ఆప్షన్ సభ్యుడు అయ్యవారిరెడ్డి, మున్సిపల్ ఆర్‌ఐ మల్లికార్జున, వార్డు సచివాలయం కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌లో గ్రాడ్యుయేషన్ డే


పట్టాను అందజేస్తున్న చొప్పా గంగిరెడ్డి

రాజంపేట : విద్యార్థులు తమకు ఎదురయ్యే అపజయాలను ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగినప్పుడే ఎంచుకున్న లక్ష్యానికి చేరుకోగలరని ఏఐటీఎస్ అధినేత చొప్పా గంగిరెడ్డి అన్నారు. గురువారం ఏఐటీఎస్ క్యాంపస్‌లో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతోపాటు క్రమశిక్షణ అలవర్చుకోవడం అవసరమన్నారు. జేఎన్టీయూ-ఏ ప్రొఫెసర్ జి.రంగజనార్ధన మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే కృషి, పట్టుదల అవసరమన్నారు. ఎంచుకున్న విద్యను కష్టంగా కాకుండా ఇష్టంగా అభ్యసిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నారాయణ, యూనివర్సిటీ నామినీ డా.ఎంసీ రాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఎం.మారుతీప్రసాద్ వారి బృందం డీన్స్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఎంపీ విరాళం


విరాళాన్ని అందజేస్తున్న సర్పంచ్ రాజేష్

పీలేరు రూరల్ : మండలంలోని ముడుపులవేముల పంచాయతీ రాయలవారిపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ మూలస్థానమ్మ, శ్రీ అంకాలమ్మ ఆలయ నిర్మాణానికి రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డి రూ.2 లక్షలు విరాళం అందించారు. గురువారం సర్పంచ్ రాజేష్ ఆలయ నిర్వాహకులు పల్లపు రత్నయ్య, సి. రవీంద్రలకు విరాళాన్ని అందజేశారు. ఆలయ నిర్మాణానికి విరాళాన్ని అందించడం పట్ల గ్రామస్తులు ఎంపీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సి. చెంగల్‌రాయుడు, సి. హరి, వై.శేఖర్, బి. శ్రీనివాసులు, బి.చలపతి, చెంగల్‌రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బందితో డీఎల్‌పీఓ సమీక్ష


సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

చిట్వేలి : స్థానిక ఎంపీపీ సభా భవనంలో గురువారం డీఎల్‌డీఓ నరసింహమూర్తి మండలంలోని అన్ని సచివాలయాల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సీడీపీఓ రాజేశ్వరి, ఈఓపీఆర్డీ రమణయ్య, పీఆర్‌ఏఈ ఆంజనేయ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పెన్షనర్ ఈకేవైసీ చేసుకోవాలి


మాట్లాడుతున్న పిచ్చయ్య

నందలూరు(రాజంపేట) : ప్రతి ప్రభుత్వ పెన్షనర్ ఈకేవైసీ త్వరగా చేసుకోవాలని ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ రాజంపేట తాలుకా అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య అన్నారు. గురువారం స్థానిక పీహెచ్‌సీలో విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ప్రతి పెన్షనర్‌ను కచ్చితంగా ఈకేవైసీ చేసుకోవాలన్నారు. లేనిపక్షంలో పెన్షన్ నిలిపివేసే పరిస్థితులు ఉంటాయన్నారు. వీలైనంతగా ఈకేవైసీ చేసుకోవాలని రాజంపేట ట్రెజరీ ఏటీఓ అమీనుద్దీన్ సూచించారని గుర్తుచేశారు. ఆధార్‌కార్డు, దానితో లింకైన మొబైల్‌ఫోన్‌ను తీసుకురావాలన్నారు. పెన్షనర్లు ట్రెజరీ కార్యాలయం, లేకుంటే ఏదైనా కంప్యూటర్ వర్క్ చేసే వారి వద్ద గాని ఈకేవైసీ చేసుకోవచ్చునన్నారు. పెన్షన్ జాప్యం జరుగకుండా, ప్రతి ఒక్కరూ ఈకేవైసీ వీలైనంత త్వరగా చేయించుకోవడం మంచిదన్నారు.

నాటు సారా ఊట ధ్వంసం

ములకలచెరువు : ములకలచెరువు సర్కిల్ పరిధిలోని తంబళ్లపల్లె మండలంలో సారా ఊట ధ్వంసం చేసినట్లు ఎస్‌ఈబీ సీఐ మల్లిక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఐ కథనం మేరకు... పెద్ద మండ్యం మండలంలోని ఆర్‌ఎన్ తండా సమీపంలో సారా వండుతున్నట్లు ముందస్తు సమాచారంతో సిబ్బందితో కలిసి 500 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసినట్లు చెప్పారు.

కేవీపల్లె : సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 500 లీటర్ల ఊట ధ్వంసం చేసినట్లు పీలేరు సెబ్ సీఐ గురుప్రసాద్ తెలిపారు. వివరాలిలా వున్నాయి. మండలంలోని జిల్లేళ్లమంద తండా పరిసర ప్రాంతాల్లో సారా తయారీ చేస్తున్నట్లు అందిన సమాచారంలో సెబ్ అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. సారా బట్టీలు గుర్తించి ఊట ధ్వంసం చేసి కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైభవంగా లక్ష్మీనారసింహుడి కల్యాణం


లక్కిరెడ్డిపల్లె: లక్ష్మీనరసింహుడి కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి


చిన్నమండెం: శ్రీ మండెం లక్ష్మీనృసింహస్వామికి అభిషేకాలు నిర్వహించిన దృశ్యం

నందలూరు(రాజంపేట) : కాసులగుట్టలో గురువారం నృసింహస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. శ్రీలక్ష్మీనృసింహస్వామి కల్యాణం వీక్షించేందుకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన భక్తులు తరలివచ్చారు. ముందుగా నృసింహస్వామి, లక్ష్మీదేవి ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణవేదికపై ఆసీనులు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ఆగమ శాస్త్రం ప్రకారం కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ అక్కిరెడ్డి స్వరూపమోహన్‌రెడ్డి, డీఆర్‌యూసీసీ మాజీ సభ్యుడు బూసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, కృష్ణదేవరాయరెడ్డి, విష్ణువర్దన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శ్రీను, నిర్వాహకుడు మల్లికార్జునరెడ్డి, విజయుడు తదితరులు పాల్గొన్నారు అన్నదాన కార్యక్రమాన్ని మాజీ ఎంపీటీసీ వనాల సిద్దయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

సిద్దవటంలో..

సిద్దవటం : పెంచల లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని గురువారం లక్ష్మీదేవి, చెంచులక్ష్మీ సమేత నరసింహ స్వామి ఉత్సవమూర్తులకు అభిషేకం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు ప్రతాప్‌శర్మ, రెడ్డినరేష్ శర్మలు వేద మంత్రాలతో స్వామి వారికి లక్ష్మీనారాయణ జపం, నరసింహ హోమం, సుదర్శన హోమం, పూర్ణాముతి తదితర పూజా కార్యాక్రమాలను జరిపారు. సాయంత్రం లక్ష్మీ నరసింహ సహస్రనామావళి, దీక్షా హోమం, తీర్ధ ప్రసాదాల వినియోగం వంటి పూజలు నిర్వహించారు. రాత్రి ఒంటిమిట్ట కళాకారులచే కోలాటం, చెక్క భజనలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం ఉదయం 10 గంటలకు కల్యాణం జరుగనుంది.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : మండలంలోని మర్రిచెట్టు క్రాస్ వద్ద వెలసిన శ్రీ లక్ష్మీనారసింహుని ఆలయంలో నిర్వహించిన శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీ నరసింహుని కల్యాణం గురువారం నయనానందకరంగా, వైభవోపేతంగా జరిపారు. అన్నమయ్య జిల్లా ఎంపీపీల సంఘం అధ్యక్షుడు మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి, రామాపురం ఏపీఓ సురేంద్రనాథ్ రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కర్నూతల అగ్రహారానికి చెందిన వెంకటనారాయణ శాస్త్రి వారి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను అలంకరించి మంగళ వాయిద్యాలు నడుమ పురవీధులలో బాణసంచా పేల్చుతూ ఊరేగింపు నిర్వహించారు. మాజీ ఎంపీపీ రెడ్డయ్య, సర్పంచ్ వెంకటనారాయణ రెడ్డి, సిద్దక నాగిరెడ్డి, ఎంపీటీసీ నాయుడు, భక్తులు పాల్గొన్నారు.

మండెం లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో

చిన్నమండెం : మండెం లక్ష్మీనృసింహస్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం ఉదయం శ్రీ స్వామి వారికి అభిషేకం, ధ్వజారోహణం, కలశారాధన, నిత్యహోమం, అర్చన, బలిహరణ, నివేదన, మహా మంగళహారతి, తీర్థప్రసాద వినియోగం కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పెనగలూరులో..

పెనగలూరు : ఈటమాపురం పెంచలకొండపై వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా గురువారం ఈటమాపురం గ్రామస్తులు మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. దాదాపు 3500 మంది వరకు ఈ అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించి స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. మహా అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ బత్తిన తిరుపాల్ రెడ్డి, వైస్ చైర్మన్ పెద్ద గుండాల్ రెడ్డిలతోపాటు ఎస్‌ఐ హేమాద్రి, గ్రామ పెద్దలు ప్రారంభించారు. ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో పోటెత్తారు.


రాజంపేట: నందలూరులో నృసింహుడి కల్యాణంలో పాల్గొన్న మహిళలు


సిద్దవటం: స్వామి వారికి అభిషేక పూజలు నిర్వహిస్తున్న వేద పండితులు


పెనగలూరు: ఈటమాపురంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయం వద్ద అన్నదానం